TELTEL12349

# మన సాక్షి
గొంతుక

తెలుగు దినపత్రిక

ఎడిటర్: గుండ రాజు

చీఫ్ ఎడిటర్: చింతల మధుకృష్ణ

విలేకరులకు ఇదే మా ఆహ్వానం

అనతి కాలంలోనే విశేష ఆదరణ పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న మన సాక్షి తెలుగు దినపత్రిక అతి త్వరలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు చేరుయ్యేందుకు సుముహూర్తం సిద్ధమయ్యింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అనుభవం, ఆసక్తి కలిగిన విలేకరులకు ఇదే మా ఆహ్వానం.

చీఫ్ ఎడిటర్ : చింతల మధుకృష్ణ

7095686969

ఎడిటర్ : గుండ రాజు

96763 33440



RNI: TELTEL12349

మన సాక్షి గొంతుక

తెలుగు దినపత్రిక ఎడిటర్: గుండ రాజు

చీఫ్ ఎడిటర్: చింతల మధుకృష్ణ

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 1 | సంచిక : 7 | 24- 3 - 2024 ఆదివారం | పేజీలు : 6 | వెల.4/-

## ఖర్చు ఇంతే ఉండాలి

- అభ్యర్థుల ఖర్చుపై ఈసీ ఫోకస్
- రేట్ల వివరాలు వెల్లడించిన ఎన్నికల కమిషన్
- సమోసా నుంచి బిర్యానీ వరకు, బైక్ నుంచి బస్సుల దాకా
- మైక్ సెట్ నుంచి మ్యాన్ పవర్ వరకు
- టీ నుంచి పబ్లిసిటీ వరకు ఖర్చుల నియంత్రణ
- లెక్క ఇంతే చూపాలి.. లిస్ట్ రిలీజ్ చేసిన ఈసీ




దేశంలో లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. మొదటి ఓటింగ్ ఏప్రిల్ 19న, ఎన్నికల ఫలితాలు జూన్ 4న ఉండబోతున్నాయి. కాగా, ఎన్నికల ఖర్చులను నియంత్రించాలని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) శనివారం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా మేజిస్ట్రేట్‌తో పాటు అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు (సీఈఓలు) ఏరియాను బట్టి అభ్యర్థుల ఖర్చులను నిర్ణయించారు. ఇందుకు సంబంధించి సీఈవోలందరూ ఎన్నికల సంఘానికి నివేదికలు పంపారు. నీళ్ల నుంచి పటాకుల వరకు, టీ నుంచి పబ్లిసిటీ వరకు ఖర్చుపై పరిమితి విషయంలో అభ్యర్థులు నిబంధనలు పాటించగలరా లేదా అనేది చూడాలన్నారు. అలాగే కమిషన్ ముందు ఎన్ని ఉల్లంఘన కేసులు వస్తున్నాయో పరిశీలించాలని ఆదేశించారు.

**వస్తువుల ధర జాబితా**

అభ్యర్థులు ప్రతి పైసా బిల్లును, లెక్కను ఎన్నికల సంఘానికి ఇవ్వాల్సి ఉంటుంది. కమిషన్ సూచనల మేరకు జిల్లా స్థాయిలో అభ్యర్థులకు వస్తువుల ధరల జాబితాను విడుదల చేశారు. ఇందులో అభ్యర్థుల ఖర్చు రేట్లను కూడా ఖరారు చేశారు. ఈసారి యూపీలో టీ, సమోసా ధర రూ.10గా నిర్ణయించగా, జిలేబీ ధర కిలో రూ.150గా ఉంచారు. సింగిల్ నాన్ ఏసీ గది ధర రూ.1150, డబుల్ బెడ్ రూ.1550గా నిర్ణయించారు. దీంతో పాటు రెండు లీటర్ల శీతల పానీయం బాటిల్ ధర రూ.90, శాఖాహారం ప్లేట్ రూ.80, నాన్ వెజిటేరియన్ ప్లేట్ ధర రూ.200గా ఉంచారు. అరలీటర్ వాటర్ బాటిల్ ధర రూ.10, లీటర్ రూ.20, రెండు లీటర్ రూ.30గా నిర్ణయించారు.

**ప్రమోషన్ రేట్లు కూడా**

ఇండికా, వ్యాగన్‌ఆర్, టాటా సుమో, మారుతీ జిప్సీ నాన్‌ఏసీ ధరలను రోజుకు రూ.1100గా ఉంచగా, ఈ ఏసీ వాహనాలకు రోజుకు రూ.1210గా ఉంచారు. స్కార్పియో, టవేరా, ఇన్నోవా, బొలెరో నాన్ ఏసీ ధర రూ.1294గా, ఏసీ వాహనాలకు రోజుకు రూ.1815గా నిర్ణయించారు. ఆయిల్ లేని ట్రాక్టర్ ట్రాలీకి రోజుకు రూ.484, ఆయిల్ లేకుండా మోటార్ సైకిల్ ద్వారా ప్రచారం చేసేందుకు రోజుకు రూ.400, సైకిల్ పై ప్రచారం చేసేందుకు రోజుకు రూ.100 చొప్పున ధర నిర్ణయించారు. ఎయిర్ కండీషనర్‌తో కూడిన సింగిల్ బెడ్ రూమ్‌ల ధర రూ.1650గా, డబుల్ బెడ్ రూమ్‌ల ధర రూ.1810గా నిర్ణయించారు.

**రాష్ట్రాల వారీగా ఖర్చులో తేడా..**

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రాల వారీగా కమిషన్ పర్యటిస్తున్నప్పుడు ఈ రేట్లు నిర్ణయించారు. అనంతరం ప్రతి జిల్లాలో అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి నిర్ణయించిన జాబితాను కచ్చితంగా పాటించాలని సీఈవోలందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇది ఇలా ఉంటే పోలింగ్ జరిగే మే 13న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

## విరాళాలు లేకుండా పార్టీని ఎలా నడుపుతాం


- పార్టీల విరాళాల సేకరణపై కేంద్ర మంత్రి గడ్కరీ రెస్పాండ్
- బాండ్స్ విధానానికి సమర్థన..
- సుప్రీంకోర్టు తీర్పుపై అసహనం
- లోపాలు ఎత్తి చూపితే బాగుండేదన్న బీజేపీ నేత



మంచి ఉద్దేశంతోనే ఎన్నికల బాండ్ల స్కీమ్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు . విరాళాలు లేకుండా ఏ రాజకీయ పార్టీని నడపడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఎన్నికల బాండ్ల అంశాన్ని ప్రస్తావించారు. ''అరుణ్ జైట్లీ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఈ పథకం గురించి జరిగిన చర్చల్లో నేను కూడా పాల్గొన్నా. ఆర్థిక వనరులు లేకుండా ఏ పార్టీ మనుగడ సాధించలేదు. కొన్ని దేశాల్లో రాజకీయ పార్టీలకు ప్రభుత్వమే నిధులు సమకూరుస్తుంది. మన దగ్గర అలాంటి వ్యవస్థ లేదు. అందుకే కేంద్రం ఈ స్కీమ్‌ను తీసుకొచ్చింది. దీని వెనుక ప్రధాన ఉద్దేశం పార్టీలు నేరుగా నిధులు పొందేందుకే. అయితే, అధికారంలో ఉన్న పార్టీ మారితే సమస్యలు తలెత్తుతాయన్న కారణంతో దాతల పేర్లను బయటపెట్టలేదు'' అని గడ్కరీ వెల్లడించారు.

**వాస్తవాలను గుర్తించాలి..**

''క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలి. నిధుల్లేకుండా పార్టీలు ఎన్నికల్లో ఎలా పోరాడుతాయి? విరాళాల్లో పారదర్శకత ఉండాలన్న మంచి ఉద్దేశంతోనే మేం ఈ బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టాం. ఇందులో ఏవైనా లోటుపాట్లు ఉన్నట్లు సుప్రీంకోర్టు గుర్తిస్తే సరిదిద్దమని పార్టీలను కోరాల్సింది. అలాంటి ఆదేశాలు వస్తే పార్టీలన్నీ కలిసి కూర్చుని దీనిపై చర్చించుకోవాలి'' అని కేంద్రమంత్రి పేర్కొన్నారు.



## కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలను..
## ఆ ప్రాంతాల్లో కట్టాలని చెప్పిందెవరు?

- బ్యారేజీలు నీటి మళ్లింపు కోసమా? నిల్వ కోసమా?..
- డీపీఆర్‌లపై సీడబ్ల్యూసీ అభ్యంతరాలను పరిష్కరించారా?
- సీడీవో, క్వాలిటీ కంట్రోల్ సలహాలను పాటించారా?
- బ్యారేజీలకు ప్రమాదాలు పొంచి ఉంటే ఏం చేయాలి?
- రాష్ట్ర నీటి పారుదల శాఖకు నిపుణుల కమిటీ ప్రశ్నలు
- ఈ నెల 26 కల్లా ప్రశ్నలకు వివరణ ఇవ్వాలని ఆదేశం

**హైదరాబాద్, మార్చి 23**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఆయా ప్రాంతాల్లో కట్టాలని చెప్పిందెవరని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎసఏ) నిపుణుల కమిటీ.. రాష్ట్ర నీటిపారుదల శాఖను ప్రశ్నించింది. 2019 వానాకాలం తర్వాత ప్రమాద సంకేతాలిచ్చినా.. నివారణ చర్యలు తీసుకోకపోవడంతోనే కాలక్రమేణా తీవ్రత పెరిగి మూడు బ్యారేజీలకు నష్టం పెరిగిందా? బ్యారేజీలను ప్రారంభించిన కొద్దిరోజులకే వాటి దిగువన రక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్లింత్ శ్లాబు, సీసీ బ్లాకులు, టోయ్‌వాల్, లాంచింగ్ అప్రాన్ వంటివి ఎందుకు కొట్టుకుపోయాయి? వాటికి నష్టం ఎందుకు జరిగింది? అని కమిటీ ప్రశ్నించింది. ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో పర్యటించి రాష్ట్ర నీటిపారుదల శాఖలోని అన్ని విభాగాలతో విస్తృత స్థాయిలో సమావేశాలు నిర్వహించిన చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ.. తిరిగి వెళ్లేటప్పుడు ఈ ప్రశ్నావళిని అందించింది. వీటికి సమాధానాలను వెంటనే సీల్డ్‌కవర్‌లో అందజేయాలని కోరింది. అయితే మంగళవారం కల్లా అందజేస్తామని నీటిపారుదల శాఖ అధికారులు నివేదించగా.. సమ్మతి తెలిపింది. కాగా, బ్యారేజీలకు ప్రమాదాలు పొంచి ఉన్నట్లు/నష్టాలు జరిగినట్లు గుర్తించిన సమాచారాన్ని వరుస క్రమంలో తెలియజేస్తూ సమగ్ర నివేదికను అధికారులు సమర్పించాల్సి ఉంటుంది. ఇందులో.. ప్రమాదాలు పొంచి ఉన్నట్లు గుర్తించినప్పుడు నీటిపారుదల శాఖ అధికారులు తీసుకున్న చర్యలేంటి? నిర్మాణ సంస్థలకు జారీ చేసిన ఆదేశాలేంటి? నిర్మాణ సంస్థలు తక్షణమే మరమ్మతులు చేపట్టాయా? వంటి వివరాలు ఈ నివేదికలో ఉండాలి. ఒకవేళ ముందుజాగ్రత్త చర్యలేమైనా తీసుకుంటే తెలపాలి. చర్యలు తీసుకోకపోతే కారణాలు వెల్లడించాలి.

## యుద్ధంలో గెలిచి తీరాలి

- శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం
- అందరికీ టికెట్లు సాధ్యం కాలేదు
- పొత్తుల వల్ల ఇవ్వలేకపోయా
- వారి సేవలను మర్చిపోలేము
- సీనియర్లకు కూడా ఇబ్బంది కలిగింది
- భవిష్యత్‌లో వారికి న్యాయం చేస్తా
- రాజకీయాలను జగన్ వ్యాపారం చేశాడు
- వైసీపీ తీరుపై చంద్రబాబు ఆగ్రహం



ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం, ఓట్లు చీలవద్దనే ఉద్దేశంతో ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేస్తున్నామని తెలుగుదేశం అధినేత చంద్రబాబు తెలిపారు. పొత్తుల వల్ల కొంతమంది నేతలకు టికెట్ ఇవ్వలేకపోయానని చెప్పారు. టీడీపీ కోసం పనిచేసిన 31 మంది నేతలకు టికెట్ ఇవ్వడం సాధ్యం కాలేదన్నారు. అయితే, పార్టీకి వారు చేసిన సేవలను తాను మర్చిపోలేదని, ఇకపైనా మర్చిపోబోనని స్పష్టం చేశారు. మూడు పార్టీల్లోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వాళ్లు ఉన్నారని చెప్పారు. పొత్తుల కారణంగా అందరికీ టికెట్ ఇవ్వడం సాధ్యం కాలేదని వివరించారు. పొత్తులతో సంబంధం లేకుండా కొందరి సీనియర్లకు కూడా టిక్కెట్లు ఇవ్వలేకపోయామని చెప్పారు. ఈ మూడు పార్టీల నేతల త్యాగాల పునాది రాష్ట్ర భవిష్యత్తుకు ఊతమిచ్చేలా ఉండాలని ఆకాక్షించారు.

**విజయావకాశాలు ఉన్న వారినే ఎంపిక..**

రాగద్వేషాలకు, రికమెండేషన్లకు అతీతంగా విజయావకాశాలు ఎక్కువగా ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసినట్లు చంద్రబాబు తెలిపారు. పార్టీ పరంగానే కాకుండా సొంతంగా ఓట్లేయించుకునే వారిని, నిలబెట్టిన అభ్యర్థులు గెలిచేలా బేరీజు వేసుకునే మూడు పార్టీల అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని వివరించారు. టికెట్ దక్కని నేతల త్యాగాన్ని పార్టీ గుర్తుంచుకుంటుందని, ప్రభుత్వం ఏర్పడ్డాక వారికి తగిన న్యాయం చేస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు హామీ ఇచ్చారు. సేవా భావంతో ఉన్న వాళ్లని రాజకీయాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు చెప్పారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారికి రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన కలుగుతోందని, రాజకీయాలను ఇంకా ప్రక్షాళన చేయగలిగితే.. మరింత మంది మంచి వారు ప్రజాసేవకు ముందుకు వస్తారని పేర్కొన్నారు.

**రాజకీయాలను జగన్ వ్యాపారం చేశాడు..**

రాజకీయాలను జగన్ వ్యాపారం చేశాడని చంద్రబాబు మండిపడ్డారు. జగన్ లాంటి సీఎంను తాను ఎక్కడా చూడలేదన్నారు. ఆయన నోరు తెరిస్తే అబద్ధాలే అని మండిపడ్డారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేధిస్తారని ఆరోపించారు. ఫేక్ ప్రచారాలతో ప్రజలను మభ్య పెట్టడం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని చంద్రబాబు మండిపడ్డారు. పురంధేశ్వరిపై, పవన్ కల్యాణ్ పై, జనసేన పార్టీపై.. అందరిపైనా తప్పుడు ప్రచారం చేశారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

## హోలీ రోజు వైన్స్ బంద్



హైదరాబాద్‌లో హోలీ పండుగ అంటే పెద్ద సంబరం. హోలీ రోజున రంగులు జల్లుకుంటూ చిన్నా పెద్ద అంటూ తేడా లేకుండా వేడుకలు జరుపుకుంటారు. అయితే ఈ ఆనందానికి కొందరు కిక్కును జోడిస్తుంటారు. అయితే మద్యం ప్రియులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఈ నెల 25న హోలీ పండుగ నాడు మద్యం షాపులు బంద్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల 25వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 26వ తేదీ ఉదయం 6 గంటల వరకు వైన్ షాపులు మూసివేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖ, అబ్కారీ శాఖలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.


**న్యూసెన్స్ క్రియేట్ చేస్తే కఠిన చర్యలు**

హైదరాబాద్ లో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా హోలీ పండుగ నాడు మందుషాపులు మూసివేయాలని నిర్వాహకులకు ఆదేశాలను జారీ చేసినట్లు పోలీసులు చెప్పారు. ఎవరైనా మద్యం తాగి బహిరంగ ప్రదేశాల్లో గొడవలకు దిగితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




- స్నేక్ వీనమ్ తీసుకుంటే ఒళ్లు తెలియని ఆనందం
- చెలరేగిపోతున్న బడా బాబుల బిడ్డలు
- పెద్ద పెద్ద పార్టీల్లో ఈ డ్రగ్ కంపల్సరీ
- ధనవంతుల రేవ్ పార్టీల్లోనూ ఇదే కల్చర్
- ఇండియాలో స్నేక్ వీనమ్‌కు ఫుల్ డిమాండ్
- 10 మిల్లీ లీటర్లు కేవలం 60 లక్షలకు పైగానే
- విషం పిండినోళ్లకు మాత్రం దక్కేది 6 వేలు
- కోట్లు దాటిన మాఫియా టర్నోవర్
- లక్ష కోట్ల పైమాటే అంటున్న పరిశీలకులు
- ఫార్మసీ టర్నోవర్ మాత్రం ₹96వేల కోట్లు
- అఫిడిజం బారిన పడుతున్న సెలబ్రిటీలు
- ఇలా అయితే కష్టమే అంటున్న వైద్య నిపుణులు

# పూనకాలు లోడింగ్!



## విషం కూడా వారికి అమృతమే!

ప్రస్తుతం పాములు ప్రాణ భయంతో బిక్కుబిక్కుమంటున్నాయి. అటవీశాఖా అధికారుల కళ్లపడితే తీసుకువెళ్లి అడవిలో వదిలేస్తుంటే.. వామ్మో కొత్త పాములోళ్లు పట్టుకెళ్లి రోజూ విషవ కక్కిస్తున్నారని .. నాగుపాములు బుస్ బుస్ అంటూ ఘోష పెడుతున్నాయి. ఇదేంటీ.. భలే తమాషాగా ఉందే అనుకుంటున్నారా.. అవును.. ఇదే నిజం !!.. పాముల బతుకులతోనూ నోట్ల వర్షం కురిపించే స్నేక్ వీనమ్ మాఫియా తెరమీదకు వచ్చింది. హా.. అట్లనా..? అని ఆశ్చర్య పోవద్దు. ఇది మాత్రం పాము విషమంత పచ్చినిజం.

**పాముల ప్రాణం.. రేవ్ కొచ్చిందోచ్..**

రేవ్ పార్టీలు పేరు వినపడటం ఆలస్యం, ఐటెమ్ సాంగ్స్ యాదికొస్తాయి.. బాగా డబ్బున్నోళ్లు, సెలబ్రిటీలు ఈ పార్టీల్లో చిందిలేస్తారనేది అందరికీ తెలిసిన విషయమే. ఈ పార్టీలే భిన్నంగా ఉంటాయి. ఇందులో మందు, చిందు మాత్రమే కాకుండా.. అంతకు మించి ఉంటుందనేది జగమెరిగిన సత్యం. అశ్లీల నృత్యాలు, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు ఇలా అనేక రకాల ఇల్లీసిట్ యాక్టివిటీస్ సర్వసాధారణం. ఈ పార్టీల రూపు రేఖలే కాదు.. కొత్త ఒరవడి కూడా ప్రత్యక్షమైంది. అదే స్నేక్ వెనమ్ అనే పదం బాగా వినిపిస్తోంది. స్నేక్ వెనమ్ అంటే పాము విషం. వామ్మో విషమా? అంటే మామూలు విషయం కాదు.. మరి.. అత్యంత ప్రమాదకర విషాన్ని ఈ పార్టీల్లో ఏం చేస్తున్నారు? అసలు ఆ విషాన్ని ఎందుకు వాడుతున్నారు? అని గుండెలదరటం ఖాయం. కానీ, ఇదే విషాన్ని అమృతంలా తాగేస్తున్నారు తెలుసా? బిగ్‌బాస్ కంటెస్టెంట్ ఈ మధ్య చెప్పిన కొన్ని విషయాలతో ఇప్పుడీ స్నేక్ వెనమ్ పేరు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది.

**యమ డిమాండు గురూ..**

డ్రగ్స్ మాఫియాలో స్నేక్ వీనమ్‌కు యమా డిమాండు ఉంది. దీన్ని కొకైన్, హెరాయిన్ పౌడర్ రూపంలోకి మార్చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా స్నేక్ వీనమ్‌కు వేల కోట్ల రూపాయల డిమాండు పెరిగింది. అసలు దీన్ని ఎలా సేకరిస్తారంటే.. ప్రపంచం మొత్తంలో 3500 రకాల పాము జాతులున్నాయి. అయితే.. అవన్నీ ప్రమాదకరం కాదు. వాటిలో కేవలం 25శాతం పాములు మాత్రమే ప్రమాదకర విషాన్ని ఉత్పత్తి చేస్తాయి. వాటితోనే మనిషి ప్రాణానికి హాని జరుగుతుంది. దేశంలో ఉండే పాము జాతుల్లో నాగుపాము విషం ఎంతో ప్రమాదకరం. ఈ నాగుపాము విషానికి రేవ్ పార్టీల్లో బీభత్సమైన డిమాండ్ ఉంది. దీని ధర రూ.కోట్లల్లో కూడా పలుకుతున్నట్టు తెలుస్తోంది.

**పాము విషంలో ఏముంటుంది..**

పాము విషం మూడు రకాలు. హెమో టాక్సిక్, సైటో టాక్సిక్, న్యూరో టాక్సిక్. హెమో టాక్సక్ గుండెపైన, సైటో టాక్సిక్ శరీర కణాలపైన, న్యూరో టాక్సిక్ నాడీ వ్యవస్థపైన పని చేస్తాయి. పాము లాలా జల గంధ్రుల నుంచి విషం ఉత్పత్తి జరుగుతుంది. నిజానికి లాలా జల గంధ్రులు ఆహార జీర్ణాన్ని సులభతరం చేస్తాయి. కానీ, పాముల కోరల్లోని వేనమ్ నోటిలోని జూటాక్సిన్ లాలా జల గంధ్రుల్ని కలవగానే అది విషంగా మారిపోతుంది. ఇలా పాము కోరల్లోని విషం ప్రమాదకరమవుతుంది. పాము కాటు వేయగానే రక్త నాళాల్లో ప్రవహిస్తూ రక్తాన్ని గడ్డకట్టిస్తుంది. దీంతో గుండెపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గుండె కొట్టుకోవడం ఆగిపోయి మరణం సంభవిస్తుంది.

**ఔషధాల తయారీలోనూ పాము విషం**

యాంటీవీనమ్ వంటి ఔషధం పాము విషం నుంచే తయారు చేస్తారు. పెయిన్స్, కేన్సర్, ఆర్థరైటీస్, స్ట్రోక్స్, హార్ట్ డిసీజ్, హిమోఫిలియా, హైపర్ టెన్షన్ వంటి ఆరోగ్య సమస్యల చికిత్సకు ఉపయోగించే ఔషధాలు దీని నుంచే తయారు చేస్తారు. శస్త్రచికిత్స సమయంలో రక్తస్రావం జరగకుండా నిరోధించడానికి అవసరమైన ఔషధాల్ని కూడా పాము విషంతో తయారు చేస్తారు. ఇక యాంటీ వీనం ఔషధ తయారీ సంస్థలు పాముల విషాలను సేకరిస్తుంటాయి. 2020లో ప్రపంచ వ్యాప్తంగా యాంటీవీనం మార్కెట్ విలువ రూ. 96, 938 కోట్లు. 2026 నాటికి యాంటి వీనం మార్కెట్ విలువ రూ. 1,58,501కోట్లకు పెరుగుతుందని అంచనా.




### ఏపీ, తెలంగాణలోనూ దందా..

దేశంలోనే కాదు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అటవీ ప్రాంతాల్లోని నాగు పాములను పట్టి విషాన్ని సేకరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాముల బెడద తప్పించుకోవటానికి పాములోళ్ల కుటుంబాలను పోషిస్తుంటారు. పాము కాటేసిన వ్యక్తుల్ని కాపాడేందుకు పాములోళ్లు సాయం చేస్తుంటారు. ఇళ్లల్లో ప్రవేశించిన పాముల్ని పట్టుకుంటారు. ఈ జీవన శైలిని స్నేక్ వెనమ్ మాఫియా మార్చేసింది. ప్రత్యేకించి పాముల్ని పట్టుకునే పరికరాలను అందించి.. అడవులకు పాములోళ్లను పంపిస్తోంది. ఒక తులం (పది మిల్లీ లీటర్లు) విషాన్ని సేకరిస్తే రూ.4 వేలు ఇస్తే... ఇప్పుడు ఈ ధర రూ. 6వేలకు చేరింది. కానీ, దళారీ ఎంతకు అమ్ముతాడో తెలుసా? తులం విషం రూ.60లక్షలు. అంటే లీటరు విషం రూ.6కోట్లు అన్నమాట. ఇది కాస్తా.. డిస్ట్రిబ్యూటర్ చేతికివెళ్తే.. వినియోదారుడికి సాదా సీదాగా దొరకదు.

### స్నేక్ వీనమ్ గుట్టు రట్టు ఇలా..

ఇటీవల బిగ్ బాస్ హిందీ ఓటీటీ 2 విన్నర్ ఎల్విష్ యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎందుకంటే అక్రమంగా స్నేక్ వెనమ్‌ను సరఫరా చేస్తున్నాడని ఆరోపణ ఉంది. పోలీసు కస్టడీలో ఎల్విష్ యాదవ్ నుంచి అనేక కీలక విషయాలు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలోనే అసలు స్నేక్ వెనమ్ అంటే ఏంటి అని అంతా వెతుకులాట మొదలెట్టారు. రేవ్ పార్టీల్లో స్నేక్ వెనమ్‌ని ఒక మత్తు పదార్థంగా.. ఉత్ప్రేరకంగా మార్చేసి వాడేస్తున్నారు. రేవ్ పార్టీల్లో వినియోగించే స్నేక్ వీనమ్ ప్రభావం ఐదు గంటల నుంచి ఐదారు రోజుల వరకు ఉంటుంది. దీని వినియోగంతో ఎంతో శక్తివంతంగా ఫీలవుతారు. ఎక్కువ సేపు డాన్స్ కూడా చేయగలరు. ఈ కారణాలతో చాలామంది సెలబ్రిటీలు స్నేక్ వెనమ్ తీసుకుంటున్నట్టు స్పష్టమవుతోంది.. దీనికి అడిక్ట్ అయితే ప్రాణానికే ప్రమాదం అని చెప్తున్నారు వైద్య నిపుణులు. ఇదొక మానసిక రుగ్మతగా మారిపోతుంది. ఒక్కో సందర్భంలో ప్రాణాలు కూడా పోతాయి. ఇలాంటి కల్చర్ విదేశాల నుంచి మన దేశానికి దిగుమతి అయ్యిందన్నది ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. స్నేక్ వీనమ్‌కు అలవాటు కావడాన్ని అఫిడిజమ్‌గా వైద్య నిపుణులు చెబుతున్నారు.

# ఎలుగుబంట్ల కలకలం



- దాడిలో ఇద్దరు మృతి..
- ఒకరి పరిస్థితి విషమం

**వజ్రపుకొత్తూరు :** ఉద్దానంలో ఎలుగుబంట్ల కలకలం సృష్టిస్తున్నాయి. వాటి సంచారంతో ఉద్దానం జీడి రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. శనివారం మండలంలోని చీపురుపల్లి పంచాయతీ అనకాపల్లిలో పిల్లల ఎలుగుబంటి బీభత్సం సృష్టించింది. జీడి తోటల్లో పనులు చేస్తున్న వారిపై దాడి చేసింది. దీంతో అప్పికొండ కూర్మారావు (47), చీడిపల్లి లోకనాధం (48) తీవ్రంగా గాయపడి మృతి చెందారు. మృతుడు లోకనాధం భార్య సావిత్రి పై కూడా దాడి చేయడంతో ఆమె కు తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషయం తెలుసుకున్న జనాలు చెరుకు తోట వద్దకు భారీగా చేరుకున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న సావిత్రి ని చికిత్స నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రి కి తరలించారు. ఎలుగుబంట్ల సంచారంపై దృష్టి సారించాలని అటవీశాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా చర్యలు లేవని ఆ శాఖ పనితీరు పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# వైసీపీ నేతలే డ్రగ్ కింగ్‌లు

## విశాఖ కేసులో ఉన్నది వారే

- వారికి పక్కా సంబంధాలు ఉన్నాయి
- పలు ఫొటోలు, ఫ్లెక్సీలు ఇదే చెబుతున్నాయి
- దీనికి సమాధానం చెప్పకుండా టీడీపీపై నిందలు
- రాష్ట్రాన్ని గంజాయి కేంద్రంగా మార్చేశారు
- ఈ ఎన్నికల్లో ప్రజలే జగన్‌కు తగిన బుద్ధి చెబుతారు
- వైసీపీ తీరుపై మండిపడ్డ చంద్రబాబు

విశాఖ డ్రగ్స్ కేసులో నిందితులుగా ఉన్నది వైసీపీ నాయకులేనని టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోపించారు. వైసీపీ నాయకులతో నిందితులకు సంబంధాలున్నాయనే విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. విజయవాడ టీడీపీ వర్క్‌షాప్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. కూనం వీరభద్రరావుకు వైసీపీ నాయకులతో సంబంధాలు ఉన్నాయన్నారు. సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫెక్సీల్లో జగన్, వైసీపీ నేతల ఫొటోలు ఉన్నాయని.. దీనికి సమాధానం చెప్పకుండా తమపై దాడి చేసేందుకు వైసీపీ ప్రయత్నం చేస్తోందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని గంజాయి రాష్ట్రంగా మార్చేశారని చంద్రబాబు ఆరోపించారు.

**డ్రగ్స్ కేసులో వైసీపీ నేతలు..**

ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చిన ఘనత వైసీపీకే దక్కుతుందని చంద్రబాబు మండిపడ్డారు. గతంలో కాకినాడ ఎమ్మెల్యే డ్రగ్స్ కేసులో ఇరుక్కుంటే.. ఆ కేసులో ఇప్పటిరవకు ఎలాంటి పురోగతి లేదన్నారు. వైసీపీ నేతల అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని.. ఈ ఎన్నికల్లో ప్రజలు జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. డ్రగ్స్ మాఫియా నుంచి ఏపీని కాపాడుకోవల్సిన అవసరం ప్రజలపైనే ఉందన్నారు. డ్రగ్స్‌పై సీఎం జగన్ ఒక్కసారైనా సమీక్ష చేశారా అని చంద్రబాబు ప్రశ్నించారు.

# మర్కుక్ మండలంలో మెదక్ బిజెపి ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు పర్యటన

- రంగనాయక స్వామి ఆలయంలో సుదర్శన హెూమం
- ఘనంగా రఘునందన్ రావు జన్మదిన వేడుకలు
- ఘన స్వాగతం పలికిన మర్కుక్ మండలం బిజెపి నాయకులు







**మన సాక్షి గొంతుక : మర్కుక్ మార్చి 23**

మర్కుక్ మండల కేంద్రంలో బిజెపి పార్టీ అధ్యక్షులు రామ్ రెడ్డి,చైతన్య శంకర్ రెడ్డి, సింగం సత్తయ్య,బిజెపి పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో మెదక్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఒక్కసారిగా మర్కుక్ మండలం కాషాయ దళంగా మారింది.బస్టాప్ నుండి ర్యాలీగా డప్పు చప్పులతో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.మర్కుక్ గ్రామస్తులను అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ శ్రీ రంగనాయక స్వామి ఆలయంకు చేరుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన సుదర్శన హెూమం లో పాల్గొన్నారు.రామ్ రెడ్డి నివాసంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు.సమావేశం లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.అనంతరం పావురాన్ని ఎగురవేశారు.ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ స్థానంలో తన గెలుపు ఖాయమని బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు.10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీలో మెదక్ పార్లమెంట్ స్థానానికి స్థానికుడైనటువంటి సరైన అభ్యర్థి లేకపోవడం చాలా సిగ్గుచేటు అని మెదక్ పార్లమెంట్ అభ్యర్థి గా పోటీ చేస్తున్న దుబ్బాక మాజీ శాసనసభ్యులు రఘునందన్ రావు అన్నారు.తెలంగాణలో బిఆర్ఎస్ మొన్నటి వరకు ప్రథమ స్థానంలో ఉందని పార్లమెంట్ ఎన్నికల అనంతరం మూడో స్థానానికి పరిమితం కాబోతుందని అన్నారు.మెదక్ లో ఈ సారి కమలం జెండా ఎరగడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు.తెలంగాణలో మెజార్టీ స్థానాల్లో తమ అభ్యర్థులు గెలుస్తారని జోస్యం చెప్పారు. 400 పైచిలుకు స్థానాల్లో జెండా పాతి కేంద్రంలో మరోసారి మోడీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.అయోధ్యలో రామమందిరం నిర్మించడం మోడీతోనే సాధ్యమైందని తెలియజేశారు.ఈరోజు మన భారతదేశంలోనే కాకుండా దుబాయ్ లో కూడా రామ మందిరం ఏర్పాటు చేశారని చెప్పారు.ప్రపంచ దేశాలు ఈరోజు మోడీ వైపు చూస్తున్నాయన్నారు. తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉండి, పద్నాలుగేళ్లు ఉద్యమ పార్టీగా ఉన్న బిఆర్ఎస్ ఈరోజు పార్టీలో కష్టపడే వారికి పదవులు ఇవ్వలేదు అన్నారు.దేశ ప్రజలందరూ తన కుటుంబ సభ్యులని ప్రధాని మోడీ భావిస్తారు.కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మూడో సారి కూడా ప్రధాని మోడీనేనని ప్రజలు చెబుతున్నారని రఘునందన్ రావు అన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి. మాజీ జెడ్పిటిసి సింగం సత్తయ్య,మాజీ అధ్యక్షులు రమేష్ గుప్త,స్థానిక ఎంపిటిసి చైతన్య శంకర్ రెడ్డి,ఉపాధ్యక్షులు తాడూరి మహేష్ గౌడ్,కొమరయ్య యాదవ్,ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి,రాజేందర్ సింగ్, మీడియా కన్వీనర్ కిషోర్ రెడ్డి,సీనియర్ నాయకులు కుమార్,సత్యనారాయణ, భాస్కర్,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కుంట సత్యం, వివిధ గ్రామాల బిజెపి నాయకులు వివిధ గ్రామాల భూత్ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా భగత్ సింగ్ 93 వ వర్ధంతి వేడుకలు

### భగత్ సింగ్ బాటలో యువత నడవాలి: పినపాక ప్రభాకర్



**మన సాక్షి గొంతుక షాద్ నగర్ :-**

షాహిద్ భగత్ సింగ్ 93 వ వర్ధంతి సందర్భంగా షాద్ నగర్ కేశంపేట్ గేట్ వద్ద భగత్ సింగ్ కాలనీ లో గల భగత్ సింగ్ విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా కార్మిక నేత పినపాక ప్రభాకర్ మాట్లాడుతూ... భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల త్యాగం మరువనిది అని, 23 ఏళ్ల వయసులో నడి యవ్వనంలో దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్. ఆయనతో పాటు ఆయన స్నేహితులు రాజ్ గురు, సుఖ్ దేవ్ ను కూడా ఉరి వేశారు, ముగ్గురు స్నేహితులు ఒకేసారి దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారు. అందుకే భారతదేశ చరిత్రలో ఆరోజు మరవలేనిది. మరుపురానిది అన్నారు. నేటి యువత భగత్ సింగ్ చరిత్రను చదివి, వారి ఆశయ సాధనలో భాగం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ యూత్ అధ్యక్షులు రోమియో రమేష్, స్నేహ మిత్రమండలి సభ్యులు నక్కల వెంకటేష్ గౌడ్, మలినేని సాంబ శివ రావు, కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షులు నల్లమోని శ్రీధర్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు బస రాజు, కార్మిక సంక్షేమ సంఘం నాయకులు సుధాకర్ గౌడ్, టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ నాయకులు రాజేష్, భాస్కర్, నాయి బ్రహ్మన్న సంఘం నాయకులు శ్రీకాంత్, కాలనీ వాసులు నల్లమోని బిక్షపతి , నదికుడ నర్సింలు, ధనుష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పార్టీ మర్కుక్ మండల అధ్యక్షుడు రాంరెడ్డికి సన్మానం



**మన సాక్షి గొంతుక : మర్కుక్ మార్చి 23**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన రాంరెడ్డిని మర్కుక్ మండల కేంద్రంలో శనివారం బీజేపీ పార్టీ సీనియర్ నాయకుడు గర్నేపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా గర్నేపల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ బీజేపీ పార్టీ మర్కుక్ మండల అధ్యక్షుడుగా రాంరెడ్డి ఎన్నికైన సందర్భంగా వారికి చిరు సన్మానం చేయడం జరిగిందని,బీజేపీ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తూ మండల అధ్యక్షునిగా ఎన్నికైన రాంరెడ్డి అభినందనీయుడు.బీజేపీ పార్టీ అధ్వర్యంలో ఈరోజు మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు అని హర్షం వ్యక్తం చేశారు.అలాగే రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీజేపీ పార్టీ అభ్యర్థి రఘునందన్ రావుకు ఓటు వేసి గెలిపించి,మెదక్ ఎంపీ సీటు నరేంద్ర మోడీ కి బహుమతిగా ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ బీజేపీ యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం శ్రీధర్,జగదేవపూర్ మండల బీజేపీ పార్టీ ఉపాధ్యక్షుడు బీమరి గణేష్, నాయకులు కొట్టాల మల్లేష్, హరికృష్ణ, రామకృష్ణ రెడ్డి తదితరులు ఉన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జూనియర్ లెక్చరర్ గా ఎన్నికైన స్వర్ణలతకు ఆత్మీయ సన్మానం

**మన సాక్షి గొంతుక మార్చి 23
దేవరకొండ ప్రతినిధి సిరందాసు
వెంకటేశ్వర్లు జిల్లా నల్గొండ**




దేవరకొండ పట్నంలోని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిండి మండలం, టీ గౌరారం గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి పెద్దయ్య ,రోజమ్మ కూతురు నల్ల స్వర్ణలత సోషల్ వెల్ఫేర్ గురుకుల ఏర్పాటు చేసినటువంటి తెలుగు ఉపన్యాస కు రాలిగా ఎన్నికైనందుకుగాను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

ఈ ఉద్యోగంతో మీకు బాధ్యత పెరిగిందని ఈ ఉద్యోగం వల్ల సమాజానికి విద్యార్థులకు సంఘానికి తోడ్పడుతూ సమాజ సేవలో అన్ని వర్గాల మన్ననలను పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ,రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కోశాధికారి పంగునూరు లింగయ్య,బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి చోల్లేటి భాస్కరాచారి, చందంపేట మాజీ జెడ్పిటిసి బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, డిండి మాజీ జడ్పిటిసి నల్ల పెద్దయ్య, స్వర్ణకారుల రాష్ట్ర కార్యదర్శి కూరెళ్ళ కృష్ణ చారి,ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడు నాగయ్య ముదిరాజ్, ఆర్యవైశ్య సంఘం వాణిజ్య సెల్ జిల్లా నాయకులు ఆలంపల్లి శ్రీనివాసులు,వడ్డెర సంఘం పట్టణ అధ్యక్షులు వరికుప్పల శ్రీను (ఎక్స్ ఆర్మీ), మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవరకొండ ఎస్.కె బురానుద్దీన్, నల్ల వెంకటయ్య,నల్ల మనోహర్, వనం బుచ్చయ్య , గిరి తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో

# యువత రాజకీయాల్లోకి రావాలి

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి

**మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:**


భగత్ సింగ్ గారి 93వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక పట్టణ కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన సెమినార్ కి ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్షులు దడిగ సందీప్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి పాల్గొని మాట్లాడుతూ నేటి తరానికి భగత్ సింగ్ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమనీ భారతదేశంలో బ్రిటిష్ వాళ్ళ పెత్తనాన్ని కూలదోయడం కోసం భగత్ సింగ్ తన చిన్న ఏటనే దేశ స్వాతంత్ర ఉద్యమంలో క్రియాశీల పోరాటాలు నిర్వహించిన నాయకుడు అని కొనియాడారు.భగత్ సింగ్ కు భారతదేశ ప్రజల మీద ఉన్న ప్రేమ అంత ఇంత కాదని తన జీవితాన్ని కూడా తృణప్రాయంగా వదిలిన మహానుభావుడని అన్నారు.భగత్ సింగ్ తన చిన్నతనం నుండే వామపక్ష భావాలకు ఆకర్షితుడై దేశ ప్రజల ప్రాణాలను కాపాడిన మహనీయుడు అని అన్నారు.నేటి యువతరం ప్రస్తుతం ఇలాంటి నాయకులను ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భవిష్యత్తులో వాళ్ల వారసత్వాన్ని నిలబెట్టడం కోసం ముందుండి పోరాడాలన్నారు.అనంతరం దేశంలో బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం ద్వారా పేద మధ్యతరగతి కుటుంబాలకు ఒరిగేదేమీ లేదని పూర్తిగా కార్పొరేట్ విధానానికి అనుకూలంగా ఉన్న నూతన విద్యా విధానాన్ని రద్దు చేయకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం,జిల్లా ఆఫీస్ బేరర్స్ భూక్య యాకన్న,మాలోతు తరుణ్,కాడబోయిన సాయి తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్ మూర్తి

**మన సాక్షి గొంతుక :**


## నీకు నువ్వే -ప్రశ్న?



నీకు నువ్వే -సమాధానం !
నీకు నువ్వే -ఓటమి ?
నీకు నువ్వే -గెలుపు !
నీకు నువ్వే -చెడు ?
నీకు నువ్వే- సంస్కారం!
నీకు నువ్వే- భయ్యం?
నీకు నువ్వే- ప్రయత్నం !
నీకు నువ్వే- ఉప్పెన ?
నీకు నువ్వే -సాటి !
నీకు నువ్వే- ఓదార్పు?
నీకు నువ్వే- సహాయం !
నీకు నువ్వే -విమర్శ ?
నీకు నువ్వే- నిరూపణ!
నీకు నువ్వే- పోరాటం?
నీకు నువ్వే- విజయం!
ప్రపంచానికి ఏదో ఒక రోజు నువ్వే ఒక మార్గదర్శం !!

ఎలగని మహేష్ గౌడ్ ..

# సొంతగూటికి చేరుకున్న చిక్కుడు మల్లేశం



**మన సాక్షి గొంతుక ప్రతినిధి /బచ్చన్నపేట మండలం**

గత ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీలో చేరిన చిక్కుడు మల్లేశం కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి సమక్షంలోసొంతగూటి కాంగ్రెస్ పార్టీలో చేరారు.జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని బోనకొల్లూరు గ్రామానికి చెందిన చిక్కుడు మల్లేశం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని సొంత గూటికి చేరినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా మండల ఇన్చార్జ్ నూకల బాల్రెడ్డి, జంగిటి విద్యనాథ్, జంగిటి నరేష్ ,మాస పేట రవీందర్ రెడ్డి, ఎద్దు హరీష్, జంగిలి స్వామి, గ్రామ శాఖ అధ్యక్షుడు బోదాసు స్వామి,ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి, చేర్యాల పెద్ద నరసింహులు, చిక్కుడు కృష్ణ, దెయ్యాల కొండయ్య, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల నరేష్, యాట శ్రీకాంత్ , చిక్కుడు స్వామి, పాల్గొన్నారు.

# నేడు సిద్దిపేటలోని మార్కండేయ దేవాలయంలో కోటి తలంబ్రాల దీక్ష



**మన సాక్షి గొంతుక : గజ్వేల్ మార్చి 23**

సిద్దిపేట లోని మార్కండేయ స్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం కోటి తలంబ్రాల దీక్ష కార్యక్రమం ఉందని గజ్వేల్ లోని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక,అధ్యక్షులు రామకోటి రామరాజు తెలిపారు.భద్రాచల రామయ్య కల్యాణానికి గోటితో వడ్లను వొలిచి తలంబ్రాలుగా తయారుచేసే కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమం నరేష్ చారి, అయిత శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

# మర్కుక్ మండలంలో బిజెపి సమావేశానికి హాజరైన పాములపర్తి బిజెపి కార్యకర్తలు

### మోడీ నాయకత్వం బలోపేతం చేయాలి ఉపాధ్యక్షుడు తాడూరి మహేష్ గౌడ్



**మన సాక్షి గొంతుక : మర్కుక్ మార్చి 23**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలలో శనివారం రోజు మెదక్ బిజెపి పార్టీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహించిన సమావేశానికి అధిక సంఖ్యలో హాజరైన పాములపర్తి బీజేపీ పార్టీ కార్యకర్తలు,భూత్ అధ్యక్షులు ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు తాడూరి మహేష్ గౌడ్ మాట్లాడుతూ బీజేపీ పార్టీనీ బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీజేపీ పార్టీ అభ్యర్థి రఘునందన్ రావుకు ఓటు వేసి గెలిపించి,మెదక్ ఎంపీ సీటు నరేంద్ర మోడీ కి బహుమతిగా ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల ఉపాధ్యక్షుడు తాడూరి మహేష్ గౌడ్,ఎడెల్లి విష్ణు,భూత్ అధ్యక్షులు ఏ.స్వామి,కె రాజు,బి స్వామి గౌడ్,యల్ సురేష్, కార్యకర్తలు బబ్బులు గౌడ్,నర్సింలు,బి స్వామి,యస్ మహేష్,అర్ మహేష్,ఎన్ లింగం తదితరులు ఉన్నారు.




# మహనీయుల త్యాగాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

– ఎన్.ఎస్.యూ.ఐ జనగామ జిల్లా అధ్యక్షుడు చిలివేరు అభి గౌడ్

మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

మమ్మల్ని చంపగలరు కానీ మా ఆశయాలని చంపలేరు అనే నినాదంతో దేశమంతా స్వతంత్ర జ్వాలను రగిలించిన పోరాట యోధులు భగత్ సింగ్,సుకుదేవ్, రాజగురుల వర్ధంతి సందర్బంగా ఎమ్మెల్సీ, ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ ఆదేశాల మేరకు ఎన్.ఎస్.యూ.ఐ జనగామ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభి గౌడ్ ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు,దేశ ప్రజలకు దేశానికి తమ ప్రాణాలని అర్పించి స్వతంత్రం సాధించడానికి పునాది వేసిన గొప్ప మహనీయులు భగత్ సింగ్,రాజగురు,సుకుదేవ్ లకు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.వారి మరణం ఎన్ని తరాలు మారిన మరువలేనిది అన్నారు.వారు చనిపోతారని తెలిసిన దేశం కోసం,దేశ ప్రజల కోసం ప్రాణాలని లెక్కచేయకుండా స్వతంత్ర పోరాటంలో నిప్పు రగిలించి స్వాతంత్రం తెచ్చుకోవడానికి మూలకారకులైన వారిని అన్ని తరాలు గుర్తుపెట్టుకొని వారి నిస్వార్థ త్యాగాన్ని విద్యార్థులు,యువకులు ఆదర్శంగా తీసుకొలన్నారు.ప్రతి ఒక్కరు వారి చరిత్ర తెలుసుకొని రాబోయే తరాలకు తెలిసే విధంగా చూస్తూ దేశం కోసం ఎలా ఉండాలి,దేశం మీద ప్రేమ ఎలా ఉండాలనేది తెలిసేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు కార్తీక్,లింగాల గన్పూర్ మండల అధ్యక్షులు ధీరజ్,జనగామ మండల ఉపాధ్యక్షులు ప్రేమ్,గుణ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్పీ సమక్షంలో బారాస లో చేరిన పలువురు బీఎస్పీ నాయకులు



మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

జనగామ నియోజకవర్గ బీఎస్పీ నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్ లో బి.అర్.ఎస్ పార్టీలో చేరడం జరిగింది. బారాస లో చేరిన వారిలో తూడి సుజయ్,బక్కమారయ్య,రామగళ్ళ విజయ్,గొల్లూరి సంతోష్ కుమార్,వంగపల్లి వినోద్ కుమార్, బక్క సునీల్,అందే ప్రశాంత్,విజయ్ భాస్కర్,ఆంజనేయులు,నరేష్,కరుణాకర్,శశి కుమార్,రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# పది పరీక్షా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఘన్పూర్ లో గల బాలిక ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ శనివారం సందర్శించారు.పదవ తరగతి పరీక్షలలో భాగంగా మూడవ రోజున మొత్తం(41) పరీక్షా కేంద్రాలలో జరిగిన గణితం పరీక్షలో జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు (6698) మందివిద్యార్థులకు గాను (6692) మంది హాజరయ్యారని,(06) మంది విద్యార్థులు గైర్హాజరు కావడంజరిగినదని హాజరు శాతం 99.91%.గా ఉందని కలెక్టర్ కు వివరించారు.అలాగే ప్రైవేటు (ఒకసారి ఫెయిల్ అయిన) విద్యార్థులు (04) గాను(03) మంది విద్యార్థులు హాజరు కావటం జరిగిందన్నారు. (01) విద్యార్ధి గైర్హాజరు కావటం జరిగినదన్నారు.పరీక్షల నిర్వహణను ప్రశాంతంగా, సజావుగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక తనిఖీ బృందాలు (13) పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించగా (06) పరీక్షా కేంద్రాలను తాను సందర్శించినట్లు డి.ఈ.ఓ తెలిపారు.కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి రాము, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుత్వ పరీక్షల విభాగం రవికుమార్ తదితరులు ఉన్నారు.

# మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రజలను ఎప్పుడూ కూడా ఇబ్బంది పెట్టలేదు

- ప్రజల అభివృద్ధి కొరకే పని చేశారు తప్ప వేరే ఆలోచన చేయలేదు
-కొత్తూరు నుండి షాద్ నగర్ వరకు రోడ్డు వెడల్పు చేసిన దానిలో ఏ ఒక్కరికి కూడా నష్టం కలిగించలేదు
-కొందరు రాజకీయ నాయకులు మేము ప్రజలకు ఇబ్బందులు కలిగించారు అనడం సరికాదు
- ప్రెస్ మీట్లో బి.ఆర్.ఎస్.నాయకులు




మన సాక్షి గొంతుక :షాద్ నగర్

షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తన పదవి కాలంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా అభివృద్ధి పనులను చేపట్టారని శ్రీనగర్ కాలనీ బిఆరెస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులు పత్రిక సమావేశం ఏర్పాటు చేసి తెలిపారు. కొత్తూరు నుండి షాద్నగర్ చౌరస్తా వరకు రోడ్డు వెడల్పు నిర్వహించిన పనులలో భాగంగా ప్రజలకు వారి ఇండ్లకు గాను వారి వ్యాపార లకు గాను వారి స్థిరాస్తులకు గాను ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రజల ఆస్తులను భంగం కలిగిస్తూ రోడ్డు విస్తరణ పనులను చేపట్టిందని కొందరు రాజకీయ నాయకులు పత్రికల ద్వారా అనడం ఏమాత్రం సారి కాదని అన్నారు..మా మాజీ ఎమ్మెల్యే కొత్తూర్ నుండి షాద్ నగర్, షాద్ నగర్ చౌరస్తా నుండి వై జంక్షన్ వరకు నాలుగు లైన్ల రోడ్డుకు 112.

# ఫార్మ్-6 ఓటర్ల దరఖాస్తుల పరిశీలన

- ప్రజాపాలన పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలి
- గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీరు సమస్య లేకుండా పక్కా ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధించిన దస్త్రాలను తనిఖీ చేసి,సిబ్బందికి తగు సూచనలు చేశారు.అలాగే రికార్డు రూంను పరిశీలించి,వివరాలు అడిగి తెలుసుకున్నారు.అదే విధంగా లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఫార్మ్-6 ఓటర్ల దరఖాస్తుల స్వీకరణ గురించి ఆరా తీశారు.డూప్లికేట్, మరణించిన,డబుల్ ఓటర్లను గుర్తించి తొలగించాలని అధికారులను ఆదేశించారు.ఈ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.అలాగే రికార్డులను డిజిటైజ్ చేసే విధానాన్ని పరిశీలించారు.అనంతరం ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించి,ప్రజాపాలన దరఖాస్తుల సవరణ,ఎన్ని దరఖాస్తులు ఆధార్ తో అనుసంధానం చేశారని,సంబంధిత వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈజీఎస్ పని భృతి గురించి ఆరా తీసి, పెండింగ్ పనులన్నీ గడువు లోగా పూర్తవ్వాలని సిబ్బందిని ఆదేశించారు.అలాగే గ్రామాల్లో తాగునీరు సమస్య లేకుండా పక్కా ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు.వేసవికాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, నిరంతరం తాగునీరును అందించాలన్నారు.గ్రామాల్లో ఉన్న చేతి



పంపులు,బోర్లు,మంచినీటి బావులు,తదితర వాటర్ సప్లై వనరుల మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆయన ఆదేశించారు.గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈజీఎస్,శానిటేషన్ పనులపై యాక్షన్ ప్లాన్ లను త్వరగా రూపొందించాలని పేర్కొన్నారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీపై ఆరా తీశారు.అదే విధంగా విద్యార్థుల స్కూల్ యూనిఫాం కుట్టే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.ఈ తనిఖీలో మండల తహసీల్దార్ వినయ లత,ఎంపిడిఓ జి.జలెందర్ రెడ్డి, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ఎంఆర్ఓ ముందు బైండోవర్

మన సాక్షి గొంతుక మార్చి23/చెన్నూర్

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం లో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ అమలు లో ఉంది అయితే తేదీ 22-03-2024 రోజున మద్దెల భవాని కే. శిరీష ,ప్రసన్న , రుక్మిణి ,సుజాత ,మౌలిక ప్రియాంక ,రేవతి ,పద్మ మరియు కొంతమంది ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా చెన్నూర్ లో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద ధర్నా చేయగా (ఎఫ్ ఎస్ టీ) టీం వాళ్ళు పిర్యాదు తో పలు సెక్షన్స్ క్రింద కేసు నమోదు చేయడం జరిగింది. అంతే కాకుండా వారిని ఎంఆర్ఓ ముందు 500000/- రు.లు పూచిక తో బైండోవర్ చేయనైనది చెన్నూర్ టౌన్ సిఐ మాట్లాడుతూ అందరూ కూడా ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం పని చేయడం జరుగుతుంది ఎవరైనా కూడా ఎన్నికల నియమావళి నీ ఉల్లంఘిస్తే చట్టరీత్య చర్యలు తిసుకొనబడుతాయి అని తెలిపినారు

# గజ్వేల్ పట్టణంలో వాహన తనిఖీలలో ?

# 50,00,000/- లక్షల రూపాయలు పట్టివేత

మన సాక్షి గొంతుక : గజ్వేల్ మార్చి 23

గజ్వేల్ పట్టణం లో వాహన తనిఖీలలో భారీ మొత్తం నగదు పట్టుబడింది.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ బి.అనురాధ,ఐపీఎస్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడానికి విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించడం జరుగుతుంది.తేదీ: 22-03-2024 అందాజ రాత్రి 9 గంటల సమయమున గజ్వేల్ పట్టణంలో గజ్వేల్ సిఐ సైదా,అడిషనల్ సీఐ ముత్యం రాజు,సిబ్బంది మరియు కేంద్ర బలగాలు సిఐఎస్ఎఫ్ సిబ్బందితో కలసి గజ్వేల్ పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేయుచుండగా కారు నెంబర్ %టూ36జ-హా%198 గలదానిలో యజమాని బచ్చు రత్నాకర్ తండ్రి రాములు,వయస్సు 45 సంవత్సరములు,గ్రామం రాయపోల్,తన యొక్క కారులో 50 లక్షల రూపాయలు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకొని వెళ్ళుచుండగా సీజ్ చేయడం జరిగింది.ప్రజలు,ప్రజాప్రతినిధులు వ్యాపారస్తులు 50 వేలకు మించి



ఎవరు కూడా డబ్బులు వాహనాలలో తీసుకొని వెళ్లవద్దని సూచించారు.ఎక్కువ తీసుకొని వెళ్ళినచో తప్పకుండా దానికి సంబంధించిన పత్రాలు వెంబడి ఉంచుకోవాలని సూచించారు. లేకుంటే డబ్బులను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. డబ్బులను ఐటీ డిపార్ట్మెంట్ కు అప్పగించడం జరుగుతుందన్నారు.కలెక్టర్ కార్యాలయంలో ఉన్న గ్రీవెన్స్ కమిటీకి ద్వారా ఐటీ డిపార్ట్మెంట్ కు అప్పగించడం జరుగుతుందన్నారు. సదరు బాధితుడు అక్కడికి వెళ్లి అధికారులకు డబ్బులకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు చూపించి రిలీజ్ చేసుకోవచ్చని తెలిపారు.

# ఒకటో తేదీ నుంచి కొత్త కానిస్టేబుల్స్‌కు ట్రైనింగ్




తెలంగాణలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి రెండో దశ శిక్షణ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతుందని టీఎస్ఎస్పీ ప్రకటించింది. మొదటి దశలో ఫిబ్రవరి 21 నుంచి శిక్షణ ప్రారంభం కాగా.. తగిన సౌకర్యాలు లేకపోవడంతో మిగతా వారికి శిక్షణను తాత్కాలికంగా వాయిదా వేశారు. ప్రస్తుతం సౌకర్యాలు కల్పించామని, 4250 మంది కానిస్టేబుళ్లకు ఏప్రిల్ 1 నుంచి శిక్షణ ప్రారంభిస్తామని టీఎస్ఎస్పీ వెల్లడించింది.

# మాస్కోలో ఉగ్రదాడి!

## ఐసిస్ ముష్కరుల ఘాతుకం

- ఏరులై పారిన బాధితుల రక్తం
- సంగీత కచేరి హాలులో బుల్లెట్ల వర్షం
- గ్రేనేడ్లతో భగ్గుమన్న కాన్సర్ట్ మాల్
- తూటాలకు 64 మంది బలి
- చావు బతుకుల్లో మరో 140 మంది
- ఉగ్రదాడిపై రష్యా ఆగ్రహం
- ఖండించిన భారత ప్రధాని మోదీ





రష్యా రాజధాని మాస్కోలోని రాక్ కాన్సర్ట్ మాల్‌లో ఉగ్రదాడి జరిగింది. శుక్రవారం రాత్రి దాదాపు 1గంట ప్రాంతంలో కొందరు ముష్కరులు సంగీత కచేరి జరుగున్న హాలులోకి ప్రవేశించి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు.. ఇందులో 64మందికి పైగా అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. మరో 140 మంది తీవ్రంగా గాయపడ్డారు.. ఆర్మీ యూనిఫాం ధరించిన దుండగులు విచక్షణా రహితంగా కాల్పులు జరపినట్టు స్థానికులు తెలిపారు. ఈ దాడిలో మొత్తం ఐదుగురు పాల్గొన్నారని బాధితులు చెబుతున్నారు. అయితే.. ఐసిస్ (ఇస్లామిక్ స్టేట్ ఇన్ ఇరాక్ అండ్ ది లెవంట్) అనే తీవ్రవాద సంస్థ ఈ దాడి చేసింది తామేనని ప్రకటించింది.

### సిటీ హాల్‌పై గ్రనేడ్ దాడి..

దాడి చేసిన వ్యక్తులు క్రోకస్ సిటీ హాల్‌పై కూడా గ్రెనేడ్ విసిరారు. దీంతో మాల్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించి క్షతగాత్రులను ,అక్కడ ఉన్న ప్రజలను సురక్షింత ప్రాంతాలకు తరలించారు.. రష్యన్ రెస్క్యూ సర్వీస్ క్రోకస్ సిటీ హాల్ కచేరీ వేదిక బేస్మెంట్ నుండి సుమారు 100 మందిని ఖాళీ చేయించింది. ఈ దాడికి పాల్పడింది తామేనంటూ ఐసిస్ ఉగ్ర సంస్థ తెలిపింది. రష్యా ప్రభుత్వం దీన్ని ఉగ్రవాద దాడిగా పేర్కొంది. రష్యా మానవ హక్కుల కమిషన్‌తో పాటు భారత ప్రధాని మోదీ, పలు దేశాల అధినేతలు ఈ దాడిని ఖండించారు.. అయితే.. ఇలాంటి దాడితో రష్యా వణికిపోవడం ఇదే తొలిసారి కాదు. రష్యాలోని మాస్కో 25 ఏళ్లలో ఇలాంటి అనేక దాడులను ఎదుర్కొంది. ఇందులో వందలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు.

### 1999లో అపార్ట్మెంట్ భవనంపై బాంబు దాడి

జనవరి 13, 1999 తెల్లవారుజామున ఆగ్నేయ మాస్కోలోని ఎనిమిది అంతస్తుల అపార్ట్మెంట్ భవనంలో బాంబు పేలింది. ఇందులో 118 మంది చనిపోయారు. మాస్కో , దక్షిణ రష్యాలో రెండు వారాల్లో మొత్తం 293 మందిని చంపిన అపార్ట్‌మెంట్ భవనాలపై జరిగిన ఐదు దాడులలో ఈ దాడి ఒకటి. ప్రధానంగా ముస్లింలు అధికంగా ఉన్న ఉత్తర కాకసస్ రిపబ్లిక్ ఆఫ్ చెచ్న్యా నుండి వేర్పాటువాద 'ఉగ్రవాదుల'పై మాస్కో దాడులకు పాల్పడింది.

### 2002లో థియేటర్ బందీ సంక్షోభం

అక్టోబరు 23, 2002న, 21 మంది పురుషులు, 19 మంది మహిళా చెచెన్ తిరుగుబాటుదారుల బృందం ఒక సంగీత కచేరీ సందర్భంగా మాస్కోలోని డుబ్రోవ్కా థియేటర్‌పై దాడి చేసింది. థియేటర్లో 800 మందికి పైగా బందీలుగా ఉన్నారు. భద్రతా దళాలతో వారి ప్రతిష్టంభన రెండు పగళ్లు, మూడు రాత్రులు కొనసాగింది. దాడి చేసిన వారిని నియంత్రించేందుకు భద్రతా బలగాలు థియేటర్‌లోకి గ్యాస్‌ను ప్రయోగించడం ప్రారంభించడంతో అది ముగిసింది. మొత్తం 130 మంది బందీలు చనిపోయారు. గ్యాస్ కారణంగా ఊపిరాడక ఎక్కువ మంది మృతి చెందినట్లు చెబుతున్నారు.

### 2003లో రాక్ కాన్సర్ట్ దాడి

జులై 5, 2003న, మాస్కో సమీపంలోని తుషినో ఎయిర్ ఫీల్డ్‌లో రాక్ సంగీత కచేరీ సందర్భంగా ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లు తమను తాము పేల్చేసుకున్నారు. ఈ ఘటనలో 15 మంది మృతి చెందగా, 50 మంది గాయపడ్డారు. ఈ మహిళలను చెచెన్ వేర్పాటువాదులుగా రష్యా గుర్తించింది. రష్యాలోని కొన్ని అగ్రశ్రేణి బ్యాండ్‌లను వినడానికి దాదాపు 20,000 మంది ప్రజలు ఈ కచేరీకి వచ్చారు.

### 2004, 2010లో మెట్రో బాంబు దాడులు

ఫిబ్రవరి 6, 2004న, ఒక చెచెన్ బృందం తెల్లవారుజామున నిండిపోయిన మాస్కో మెట్రోలో బాంబును పేల్చింది. 41 మంది మరణించారు. మార్చి 29, 2010న, మాస్కో మెట్రోలో మరో ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లు తమను తాము పేల్చేసుకున్నారు. ఈ దాడుల్లో 40 మంది చనిపోయారు. దాడి చేసిన వ్యక్తులు ఎఫ్ఎస్‌బి ఇంటెలిజెన్స్ సర్వీసెస్ ప్రధాన కార్యాలయం పక్కన ఉన్న లుబియాంకా స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. దాడి చేసిన ఇద్దరూ డాగేస్తాన్‌లోని అస్థిర నార్త్ కాకసస్ ప్రాంతానికి చెందినవారు.

### 2011లో విమానాశ్రయ దాడి

జనవరి 24, 2011న, మాస్కో డొమోడెడోవో అంతర్జాతీయ విమానాశ్రయం అరైవింగ్ హాలు పై ఆత్మాహుతి బాంబర్ దాడి చేసి 37 మందిని చంపారు. ఈ దాడికి బాధ్యులమని కాకసస్ ఎమిరేట్ గ్రూప్ ప్రకటించింది.

# బిగ్‌బాస్‌కు స్వాగతం

## కేజ్రీవాల్‌కు సుఖేశ్ లేఖ

- దిమ్మతిరిగే విషయాలను పేర్కొన్న కన్‌మన్
- ముడుపులు డిమాండ్ చేసింది కేజ్రీవాలే
- మీ మోసాలను బహిర్గతం చేస్తామన్న చంద్రశేఖర్
- తీహార్ జైలులో తన బర్త్‌డే ముందే వచ్చిందని వెల్లడి



ఆర్థిక నేరారోపణల కింద తీహార్ జైలులో ఉన్న కన్‌మన్ సుఖేశ్ చంద్రశేఖర్ ఎప్పటికప్పుడు లేఖలు విడుదల చేస్తూ.. పలు సంచలనాలకు కేరాఫ్‌గా మారాడు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవిత, ఆప్ నేతలు కేజ్రీవాల్, సత్యేంద్ర జైన్, సిసోడియాపై ఇప్పటికే ఆరోపణలు చేస్తూ సుఖేష్ పలు లేఖలు విడుదల చేశాడు. తాజాగా ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు తీహార్ జైలు స్వాగతం పలుకుతుందంటూ లేఖ రాసిన సుఖేష్.. కేజ్రీవాల్‌ను వదిలిపెట్టలేదు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కేజ్రీవాల్‌ను ఈనెల 21న ఈడీ అరెస్ట్ చేయగా.. శుక్రవారం ఆయనను 6 రోజుల ఈడీ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో 'తీహార్ క్లబ్'లోకి స్వాగతం అంటూ సుఖేష్ శనివారం మరో లేఖ విడుదల చేశాడు.

### ముడుపులు డిమాండ్ చేసింది కేజ్రీవాలే

కేజ్రీవాల్ మోసగాడు.. సత్యం ఎప్పటికీ గెలుస్తుంది.. చట్టానికి ఎవరూ అతీతులు కాదని చెప్పడానికి ఇదే ఉదాహరణ అంటూ సుఖేష్ తన లేఖలో పేర్కొన్నాడు. తీహార్ క్లబ్ బిగ్ బాస్‌గా మిమల్ని స్వాగతిస్తున్నానంటూ లేఖలో పేర్కొన్నాడు. మీ డ్రామాలు చివరి దశకు చేరుకున్నాయి. ఇక ఎంత నటించినా తప్పించుకోలేరని సుఖేష్ లేఖలో పేర్కొన్నాడు. మార్చి 25వ తేదీన తన పుట్టినరోజని, మూడు రోజుల ముందే బర్త్‌డే సెలబ్రేషన్స్ జరుపుకుంటున్నట్లు తెలిపాడు. మీ అరెస్టును నా పుట్టినరోజు బహుమతిగా భావిస్తున్న అంటూ సుఖేష్ పేర్కొన్నాడు.

### ముగ్గురు సోదరులు..

తీహార్ జైలును నడపడానికి తన ముగ్గురు సోదరులు ఇక్కడకు వచ్చారని.. ఒకరు ఛైర్మన్ బిగ్‌బాస్ అరవింద్ కేజ్రీవాల్ అయితే.. సీఈవో మనీష్ సిసోడియా, సీఓఓ సత్యేందర్ జైన్ అంటూ సుఖేష్ తన లేఖలో పేర్కొన్నాడు. బ్రదర్ కేజ్రీవాల్ మీ అవినీతి అంతా బయట పడబోతుంది.. మీరు సీఎం హోదాలో చేసిన స్కామ్‌లతో పేదలను దోచుకున్నారు అంటూ సుఖేష్ ఆరోపించాడు. మీ మోసాలను పూర్తిగా బహిర్గతం చేస్తానాంటూ లేఖలో హెచ్చరించాడు.

# భూమి బదిలీతో మనస్తాపం

## రైతు కుటుంబం ఆత్మహత్య

- భార్య బిడ్డలతో సహా ఫ్యామిలీ అంతా బలవన్మరణం
- కడప జిల్లా మాధవరంలో విషాదం
- రెవెన్యూ అధికారుల అవినీతి లీలలు
- కుటుంబ సభ్యుల ఆరోపణ



రెవెన్యూ అధికారుల కలం పోటుతో ఓ రైతు కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. తమ బతుకు తెరువుకు ఆధారమైన తమ భూమిని ఇతరులకు రెవెన్యూ అధికారులు ధారదత్తం చేయటంతో...అధికారులు కోరిన ముడుపులు చెల్లించినా.. తమ భూమి దక్కదని తెలిసి.. ఓ రైతు కుటుంబంలోని ముగ్గురూ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఏపీలో తీవ్ర సంచలనం రేపింది. ఈ విషాద ఘటన కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు, కొత్త మాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు (47)కు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురు చదువు కోసం హైదరాబాద్ వెళ్లగా చిన్న కూతురు వినయ, భార్య పద్మావతి తో కలిసి సుబ్బారావు కొత్త మాధవరంలో వ్యవసాయం చేస్తున్నారు.

### రెవెన్యూ అధికారులదే తప్పంతా..

పాల సుబ్బారావుకు ఒంటిమిట్ట మండలం మాధవరంలో 3.10 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి గతంలో ప్రభుత్వం అందించే రైతు భరోసా సొమ్ము కూడా సుబ్బారావు ఖాతాలో జమ అవుతోంది. గత కొద్ది కొన్నేళ్ళుగా తన పేరుతో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు కట్టా శ్రావణి అనే పేరుతో ఆన్ లైన్ లో మార్చారు.ఈ భూమిని తిరిగి తన పేరుతో మార్చుకోవడానికి పాల సుబ్బారావు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం కనిపించలేదు. ఇందుకోసం రెవెన్యూ అధికారులకు ఈయన ముడుపులు కూడా ముట్టచెప్పాడు.. అయినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మనస్థాపం చెందిన పాల సుబ్బారావు రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకోగా... భార్య పద్మావతి, కుమార్తె వినయ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై ఒంటి మిట్ట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# స్పై దందా!

## రిటైర్డు పోలీసు ఆఫీసర్ల ఇంట్లో సోదాలు

ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావు విచారణతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సంచలనాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారాలకు కర్త, కర్మ, క్రియ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు అని దాదాపుగా నిర్ధారణ అయ్యింది. నిఘా ముసుగులో ప్రభాకర్ అండ్ టీమ్ చట్ట వ్యతిరేక పనులకు పాల్పడినట్లు తేలింది. ఇష్టానుసారం ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్‌లు చేయడమే కాకుండా.. పెద్ద ఎత్తున్న బ్లాక్ మెయిలింగ్ దందా నడిపి భారీగా సొమ్ములు వసూలు చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు , ఇంటెలిజెన్స్ మాజీ ఎస్పీ భుజంగరావు ఎస్ఐబీ డీఎస్పీ తిరుపతన్న, హైదరాబాద్ సిటీ టాస్క్ ఫోర్ మాజీ డీసీపీ రాధా కిషన్ రావు ఇళ్లలో శనివారం పోలీసులు సోదాలు చేపట్టారు. వారికి చెందిన పది ప్రాంతాల్లో 10చోట్ల ఏక కాలంలో ఈ తనిఖీలు కొనసాగాయి.

### 2018 నుంచి ఇదే పని..

ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు 2018 నుంచి ప్రతిపక్ష నేతల ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేపిస్తూ వచ్చారని పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. నల్లగొండ ఎస్పీగా ఉన్న టైమ్‌లో తనకు నమ్మకంగా ఉన్న కొందరు అధికారులతో ప్రైవేట్ సైన్యం ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ప్రధానంగా స్పై పోలీసుల ముఠాలో టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, భుజంగరావు, తిరుపతన్నలను కీలక సభ్యులుగా చేర్చారని, మరికొందరు పోలీసుల హస్తం కూడా ఉన్నట్లు ఈ విచారణలో తేలింది.

### ట్యాపింగ్ పరికరాలకోసం ఇజ్రాయెల్, రష్యాలో పర్యటన

ట్యాపింగ్, ఇతర నిఘా పరికరాలపై అధ్యయనం కోసం ఇజ్రాయెల్, రష్యాలో సైతం పర్యటించినట్లు ఇప్పటికే గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభాకర్ టీమ్‌కు రవి పాల్ సాంకేతిక సహకారం అందించారు. రవిపాల్ సూచన మేరకే సూట్ కేసులో పట్టే పరికరంతో ఆనాటి ప్రతిపక్ష నేత ఇళ్ల వద్ద ఎస్ఐబీ టీం మాటు వేసేది. ట్యాపింగ్ ఎంత పక్కాగా జరిగేదంటే.. కేంద్రానికి సమాచారం ఇవ్వకుండా ఉండేందుకు నిబంధనల కన్నా తక్కువ సమయంతో ట్యాపింగ్ వ్యవహారాన్ని ఆ బృందం నడిపినట్టు సమాచారం.

### విపక్ష నేతలు, వ్యాపారులపై

నాటి విపక్ష నేతలే కాకుండా.. వ్యాపారస్తులను సైతం ప్రభాకర్ బృందం టార్గెట్ చేసింది. సుమారు 30మందికి పైగా వ్యాపారుల ఫోన్లపై నిఘా వేసి అక్రమంగా ఫోన్ల ట్యాప్ చేసి బ్లాక్‌మెయిల్ చేసినట్లు విచారణలో వెల్లడయ్యింది. ఇప్పటికే ఈ కేసులో అరెస్ట్ అయిన ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీతరావు ఈ విషయాలన్ని వెల్లడించారు. ఈ బ్లాక్ మెయిలింగ్ ద్వారా ₹500600 కోట్ల దాకా వసూలు చేసినట్లు అనుమానిస్తున్నారు.. అందుకే ఆయా మాజీ అధికారుల ఆస్తులకు సంబంధించిన వివరాలను సైతం సేకరించే దిశగా ఈ సోదాలు జరుగుతున్నట్లు స్పష్టం అవుతోంది.



- ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకరరావు, మాజీ ఎస్పీ భుజంగరావు , ఎస్ఐబీ డీఎస్పీ తిరుపతన్న, హైదరాబాద్ సిటీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధా కిషన్ రావు ఇళ్లలోనూ పోలీసుల తనిఖీలు
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సంచలనాలు వెలుగులోకి
- ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు నేతృత్వంలో స్పై దందా
- ప్రతిపక్ష నేతలతో పాటు వ్యాపారవేత్తల ఫోన్ల అక్రమ ట్యాపింగ్
- బ్లాక్‌మెయిల్‌కు దిగి వందల కోట్ల వసూళ్లు!!
- ట్యాపింగ్ టెక్నాలజీ కోసం రష్యా, ఇజ్రాయెల్‌లో పర్యటన
- ప్రణీత్‌రావుపై వేటుతో పరారీలో ప్రభాకర్ రావు
- ఈ దందాకు ప్రభాకరరావే బాధ్యుడంటూ ప్రణీత్ రావు వాగ్మూలం

### విదేశాలకు ప్రభాకరరావు జంప్

తెలంగాణ ఏర్పడ్డాక సీసీఎస్ డీసీపీగా ప్రభాకర్‌రావు పనిచేశారు. 2020లో ఇంటెలిజెన్స్ ఐజీగా పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత అప్పటి ప్రభుత్వం ఓఎస్డీలో బాధ్యతలు అప్పగించింది. గతేడాది ప్రభుత్వం మారాక ఓడీఎస్ పోస్టుకు ప్రభాకర్ రాజీనామా చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎస్ఐబీలో డీఎస్పీగా పనిచేసిన ప్రణీత్‌రావుపై వేటు పడింది. ప్రణీత్ రావు ప్రభాకర్‌రావుకు బంధువు కూడా. ప్రణీత్ అరెస్ట్ వార్త తెలిసిన వెంటనే ప్రభాకర్‌రావు అప్రమత్తం అయ్యారు. కుటుంబంతో విహారయాత్ర పేరుతో హైదరాబాద్ దాటారు. అటు నుంచి అటే ఆయన అమెరికా వెళ్లినట్టు తెలుస్తోంది.



# స్లిమ్‌గా బోల్డ్ పాప



**యంగ్ బ్యూటీ** షాలిని పాండే తొలి చిత్రంతోనే యువతకి స్వీట్ షాక్ ఇచ్చింది. అర్జున్ రెడ్డి తర్వాత షాలిని పాండేకి అన్ని భాషల్లో అవకాశాలు వచ్చాయి. యంగ్ బ్యూటీ షాలిని పాండే తొలి చిత్రంతోనే యువతకి స్వీట్ షాక్ ఇచ్చింది. అర్జున్ రెడ్డి మూవీలో షాలిని పాండే రొమాన్స్ తో రెచ్చిపోయింది. ఈ మూవీతో షాలిని పాండేకి పాపులారిటీ దక్కింది. నటన పరంగా కూడా షాలిని ఆకట్టుకుంది. విజయ్ దేవరకొండతో రొమాన్స్ పండిస్తూనే ఎమోషనల్ గా కూడా మెప్పించింది. తొలి చిత్రంలోనే ఆ తరహా రోల్ చేయడం సాహసమే అని చెప్పాలి. అర్జున్ రెడ్డి చిత్రం బాలీవుడ్ లో కూడా హాట్ టాపిక్ గా నిలిచిన సంగతి తెలిసిందే. చిన్న చిత్రంగా విడుదలైన అర్జున్ రెడ్డి మూవీ తిరుగులేని విజయం సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని షాహిద్ కపూర్ హిందీలో రీమేక్ చేశారు. అర్జున్ రెడ్డి తర్వాత షాలిని పాండేకి అన్ని భాషల్లో అవకాశాలు వచ్చాయి. 118 చిత్రంలో, ఇద్దరి లోకం ఒకటే మూవీలో షాలిని నటించింది. షాలిని పాండే హిందీలో రణ్వీర్ సింగ్ సరసన 'జయేష్ భాయ్ జోర్దార్' అనే చిత్రంలో నటించింది. అర్జున్ రెడ్డి చిత్రంలో కాస్త బొద్దుగా కనిపించిన షాలిని ఇటీవల తన లుక్ పై ఫోకస్ పెట్టింది. బరువు తగ్గి బాగా నాజూగ్గా మారింది. ప్రస్తుతం షాలిని లుక్ కుర్రాళ్లని ఆకర్షించే విధంగా స్టన్నింగ్ అనిపిస్తోంది. తాజాగా షాలిని పాండే వైట్ డ్రెస్ లో జాబిలమ్మలా వెలిగిపోతోంది. టైట్ ఫిట్ గా ఉన్న డ్రెస్ లో షాలిని పర్ఫెక్ట్ ఆ ఇస్తున్న ఫోజులు చూపు తిప్పుకోనీయడం లేదు. షాలిని ఇస్తున్న ఫోజులు మైండ్ బ్లోయింగ్ అనే చెప్పాలి. క్రేజీగా స్టైలిష్ గా షాలిని పాండే ఇచ్చిన ఫోజులు వైరల్ అవుతున్నాయి. షాలిని పాండే ఇకనైనా నటిగా అవకాశాలు చేజిక్కించుకుంటుందేమో చూడాలి.



# పూల చీరలో జాబిలమ్మ

హీరోయిన్ రీతూ వర్మ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోస్ వైరలవుతున్నాయి. బ్లాక్ కలర్ పూల చీరలో అందమే అద్భుతమైందేమో అన్నట్లుగా కనిపిస్తుంది. చూపులతో మతిపోగొట్టేస్తోనే.. సింపుల్ అండ్ క్యూట్ లుక్స్ తో మంత్రముగ్ధులను చేస్తుంది. ప్రస్తుతం రీతూవర్మ బ్యూటీఫుల్ ఫొటోస్ నెట్టింట వైరలవుతుండగా.. నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. రీతూ వర్మ చివరిసారిగా శర్వానంద్ నటించిన ఒకే ఒక జీవితం సినిమాలో కనిపించింది. ఆమె ప్రస్తుతం తమిళంలో బిజీగా ఉంది.



# క్వీన్‌కు పెళ్లంట !

కంగన రనౌత్ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారా? రెడ్డిట్‌లో నిరంతర చర్చ ఇది. క్వీన్ తనకు పెళ్లి చేసుకునే ఆలోచన ఉందని తరచూ చెబుతూనే ఉంది. తనకంటూ ఒక కుటుంబాన్ని కలిగి ఉండాలని ఆశిస్తున్నట్లు తెలిపింది. పెళ్లి అనే సంస్థపై తనకు నమ్మకం ఉందని కంగనా చెప్పింది. 2024లో రకుల్ ప్రీత్ సింగ్, కృతి కర్బందా, మీరా చోప్రా వివాహాలు జరిగాయి. కంగనా రనౌత్ కూడా ఇతర భామల్లానే నిజంగా రహస్య పద్ధతిలో వివాహం చేసుకుంటే అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. కొన్ని రోజుల క్రితం క్వీన్ శాంతాక్రూజ్‌లోని సెలూన్ వెలుపల ఒక వ్యక్తి చేయి పట్టుకుని కార్ వద్దకు వెళుతూ కనిపించింది. ఆమె జీవితంలో ప్రత్యేక వ్యక్తి ఎవరైనా దొరికారా? అని మీడియా ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ప్రముఖ వ్యాపారవేత్త నిశాంత్ పిట్టిని కంగన పెళ్లి చేసుకుంది అంటూ ఊహాగానాలు సాగాయి. ఇప్పుడు మళ్లీ కంగనా రనౌత్ పెళ్లిపై రూమర్లు వస్తున్నాయి. ఇప్పుడు కంగనా రనౌత్ తన పెళ్లి దుస్తులను డిజైన్ చేయిస్తోందని రెడ్డిట్‌లో ఒక కథనం వెలువడింది. ఇది లెహంగానా లేక డిజైనర్ శారీనా? అన్నది ఇప్పటికి తెలీదు. కానీ దీనికోసం పాపులర్ ఫ్యాషన్ డిజైనర్లు పని చేస్తున్నారని తెలిసింది. ఫ్యాషన్ రంగంలో అగ్ర శ్రేణి డిజైనర్ సోదరుల నుంచి ఈ విషయం లీకైంది. ఒక ఇంటర్వ్యూలో డిజైనర్ అనుకోకుండా వార్తలను లీక్ చేసింది.

# రెడ్ చిల్లీ



కలెక్షన్ కింగ్ మోహన్ బాబు డాటర్ గా టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చినా.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది మంచు లక్ష్మి. తనదైన రీతిలో టాలెంట్ ప్రదర్శిస్తూ హైలైట్ అయింది. అందంతో పాటు యాక్టింగ్ తో మంచి పేరు కొట్టేసింది. వరుస చిత్రాలు చేస్తూ సందడి చేస్తోంది. తండ్రి చూపిన సినీ బాటలోనే నడుస్తోంది మంచు డాటర్. ఇంగ్లీష్ ఫిల్మ్ ద ఓడ్ తో తన యాక్టింగ్ కెరీర్ స్టార్ట్ చేసింది మంచు లక్ష్మి. ఆ తర్వాత డియర్ ఎయిర్ మూవీ చేసిన ఈ బ్యూటీ.. ఆ ఇయరే నిర్మాతగా తన ప్రయాణాన్ని మొదలు పెట్టింది. లక్ష్మి టాక్ షో ప్రోగ్రామ్ తో బుల్లితెరపైకి కూడా ఎంట్రీ ఇచ్చింది. ఆ సమయంలో అనగనగా ఓ ధీరుడు మూవీతో టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది. ఫస్ట్ తెలుగు మూవీలో తన నటనతో మంచి మార్కులు కొట్టేసింది లక్ష్మీ ప్రసన్న. అయితే గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో మంచు లక్ష్మి ఎంత యాక్టివ్ గా ఉందో అందరికీ తెలిసిందే. కంటిన్యూగా నయా లుక్స్ లో మెరుస్తూ అందరినీ ఆకట్టుకుంటోంది. ట్రెండీ ఔట్ ఫిట్స్ లో ఫొటో షూట్స్ చేస్తూ కొత్త ఫ్యాషన్ ను తన ఫాలోవర్స్ కు పరిచయం చేస్తోంది. రకరకాల పోజులు ఇస్తూ మైమరపిస్తోంది. గ్లామర్ డోస్ ఫుల్ గా పెంచేసి ఓ రేంజ్ లో సందడి చేస్తోంది. తాజాగా రెడ్ చిల్లీలా రెడ్ కలర్ డ్రెస్ లో కిర్రాక్ పోజులిచ్చింది. లిఫ్ట్ లో ఫొటోలు దిగి తన లుక్స్ తో కట్టిపడేసింది. లైట్ గా థైస్ షో చేస్తూ అట్రాక్ట్ చేస్తోంది. ఓర చూపులతో ఫిదా చేస్తోంది. మంచు లక్ష్మి పోస్ట్ చేసిన క్షణాల్లోనే కొత్త పిక్స్ వైరల్ గా మారాయి. ముంబై వెళ్లాక బాలీవుడ్ టచ్ ఇచ్చావ్ గా అంటూ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. మరి చూడాలి బీటౌన్ లో మంచు లక్ష్మి ఎలాంటి అవకాశాలు దక్కించుకుంటుందో.

# రావయ్యా.. మా అన్నయ్య!

ఆసక్తికరమైన సీరియల్స్‌తో తెలుగువారిని ఆకట్టుకుంటున్న జీ తెలుగులో మరో అందమైన డైలీ సీరియల్ ప్రసారం కానుంది. అన్నాచెల్లెళ్ల అనుబంధం, మానవ విలువలకు పట్టం కట్టే కథతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ 'మా అన్నయ్య'.

ఈ సీరియల్‌తో మైత్రీ మూవీ మేకర్స్ బుల్లితెరకు పరిచయం అవుతుండటం విశేషం. ఈ నెల 25న సీరియల్ ప్రారంభం కానుంది. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు ఇది ప్రసారం కానుంది. అనూహ్యమైన మలుపులతో తీర్చిదిద్దుతున్న 'మా అన్నయ్య' తెలుగు ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుందని జీ తెలుగు యాజమాన్యం పేర్కొన్నది.

